క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (లీగల్): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, సుబ్బారెడ్డిని జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. వివిధ అంశాలపై వారికి వినతిపత్రాన్ని సమర్పించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జస్టిస్ జయసూర్య తెలిపారు. న్యాయశాఖ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్ బాబు, నారాయణరెడ్డి, ట్రెజరర్ సునీల్, నేతలు శివకుమార్, నరసింహరావు, వెంకటేశ్వర్లు, సురేంద్రబాబు, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సెల్ఫీ పాయింట్‌లో జేసీ

కోవూరు : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ యువతకు పిలుపునిచ్చారు. కోవూరులోని గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీలో ఓటు హక్కు వినియోగంపై సెల్ఫీ పాయింట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 11వ తేదీ వరకు సెల్ఫీ పాయింట్ ఉంటుందని తెలియజేశారు. ప్రతిఒక్కరూ ఓటు ఆవశ్యకతను తెలుసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ అధికారులు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ గిరిజన సదస్సు రేపు



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : మండలంలోని పడుగుపాడు జాతీయ రహదారిపై శివాలయం ఎదురుగా ఉన్న మైదానంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ గిరిజన సదస్సు సోమవారం జరుగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఎంపీలు వేణుంబాక విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరు మేయర్ స్రవంతితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు.

మెరుగైన వరి దిగుబడులు



ధాన్యం కొలతలు పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ముత్తుకూరు : రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యానికి దిగుబడులు బేషుగ్గా వస్తున్నాయని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలో వివిధ రకాల వరి కోతలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీపీటీ ఎకరానికి 3.5 నుంచి 5 పుట్లు దిగుబడి అవుతోందన్నారు. పుట్టి ధర రూ.22 వేల నుంచి 23 వేల వరకు ఉందన్నారు. కేఎన్ఎం 1638 రకం వరి 3 నుంచి 4 పుట్ల వరకు దిగుబడి వస్తోందని వెల్లడించారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం రూ.22 వేల నుంచి 23 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. రైతులు ధైర్యంగా బయట మార్కెట్లో అమ్మకాలు చేసుకోవచ్చని సూచించారు. మార్కెట్లో ధరలు తక్కువగా ఉంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవచ్చన్నారు.

నేదురుమల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం

పొదలకూరు : మండలంలోని నేదురుమల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. ముందుగా రక్త, బీపీ పరీక్షలు చేశారు. పెద్ద సంఖ్యలో రోగులు శిబిరానికి హాజరయ్యారు.

చంద్రబాబు హామీలు బూటకం



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: టీడీపీ అధినేత చంద్రబాబు హామీలు బూటకమని, ఆయన అధికారంలోకి వస్తే పథకాలను రద్దు చేస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 31వ డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు ఆదాల సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు గానూ తమ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు ఏసునాయుడు, పిండి సురేష్, కంతర్ అలీ, పుట్టా విజయ్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మొబీనా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రన్ ఫర్ జీసస్



నెల్లూరు(బృందావనం): గుడ్ ఫ్రైడే, ఈస్టర్ విశిష్టతను వివరిస్తూ నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఘనంగా శనివారం నిర్వహించారు. సుబేదారుపేటలోని ఏబీఎం కాంపౌండ్ నుంచి బట్వాడిపాళెంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి వరకు కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొలుత ఏబీఎం కాంపౌండ్‌లో రన్‌ను నెల్లూరు జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్ ప్రారంభించారు. అనంతరం ఈస్టర్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఊరందూరు సురేంద్రబాబు, బర్నబాస్, రెవరెండ్ రాజశేఖర్ దాసరి, ప్రేమ్‌కుమార్, రూఫస్, కమలాకర్, హరిపాల్, జోసఫ్‌బాబు, పాస్టర్లు గడ్డం హనోక్, ఆనంద్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులకు శిక్షణ



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని డీకేడబ్ల్యూ మహిళా కళాశాలలో పోలింగ్, సహాయక పోలింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడారు. అన్ని అంశాలపై మాస్టర్ ట్రైయినర్లు శిక్షణ ఇచ్చారని చెప్పారు. అదనపు కమిషనర్ శర్మద, ఏఈఆర్వోలు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతను గెలిపించండి



ప్రచారం చేస్తున్న హిమబిందు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమార్తె హిమబిందు కోరారు. 35వ డివిజన్లో ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించిన ఆమె మాట్లాడారు. గడిచిన పది నెలల్లో రూరల్ నియోజకవర్గాన్ని ఆదాల ఎనలేని విధంగా అభివృద్ధి చేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జీజీహెచ్ కోఆర్డినేటర్ సునంద, పార్టీ నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్ యాకసిరి వాసంతి, డివిజన్ ఇన్‌చార్జి శరత్‌చంద్ర, నేతలు రంజిత్, కిరణ్, పసుపులేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



నెల్లూరు(క్రైమ్): రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సంతపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు కోరారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని కపాడిపాళెం, సుబేదార్‌పేట, బోసుబొమ్మ, కొత్తహాల్ సెంటర్, కాపువీధి, సంతపేట, రంగనాయకులపేట, వారధి సెంటర్, గాంధీగిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా.. ఓటర్లను భయాందోళనలకు గురిచేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): మాతాశిశు మరణాలను అరికట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశించారు. మాతాశిశు మరణాలపై సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగు నెలల్లో మూడు మాతృ.. 13 శిశు మరణాలు జరగడం బాధాకరమన్నారు. బాల్య వివాహాలు.. నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం.. పిల్లలు అతి తక్కువ బరువుతో జన్మించడం.. రక్తహీనత.. తదితర కారణాలతో మాతాశిశు మరణాలు జరిగాయనే అంశాన్ని నిర్ధారించామని చెప్పారు. ఏఎన్ఎంలు రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి కాన్పు జరిగేంత వరకు సకాలంలో టీకాలు, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందించడం, సకాలంలో వైద్యపరీక్షలు నిర్వహించడం తదితర చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్, జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి గీతాలక్ష్మి, డాక్టర్ రామచంద్రరావు, పీడియాట్రీషియన్ సింధు, డాక్టర్ శ్రీధర్, ఎఫ్పీసీ నోడల్ అధికారి దయాకర్, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డాక్టర్ నవీన్, డీపీహెచ్ఎన్ఓ మంజుల, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, ఏఓ సహనా తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు, నర్సులు తమ వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో తప్పక నమోదు చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌పై సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, వైద్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ మిషన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఐడీ వస్తుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే రోగుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డాక్టర్లు నవీన్, భాస్కర్, జిల్లా మలేరియాధికారి హుస్సేనమ్మ, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు నాలుగు కుట్టు మెషీన్లను నెహ్రూ ప్రియదర్శిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు సుధారాణి, సెక్రటరీ కల్యాణి, ట్రెజరర్ స్వర్ణలత, ప్రధానోపాధ్యాయుడు రాజమనోహర్, ఉపాధ్యాయులు చినమస్తానయ్య, పద్మ, శారద, షాహీనా, శైలజ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన కమిషనర్



నెల్లూరు(బారకాసు): నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జయసూర్య, సుబ్బారెడ్డిని కమిషనర్ వికాస్ మర్మత్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా వీరికి మొక్కను అందజేశారు.

పన్నులపై వడ్డీ మాఫీకి నేడే చివరి అవకాశం

నెల్లూరు(బారకాసు): పన్నులపై వడ్డీ మాఫీ అవకాశం ఆదివారంతో ముగియనుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగాధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు పన్ను చెల్లింపుదారులను కలిసి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. కుళాయి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులను గుర్తించి వారి మంచినీటి సరఫరా కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు.

సామాన్యుడ్ని అసెంబ్లీకి పంపాలనుకోవడం తప్పా..?

నెల్లూరు(దర్గామిట్ట): సామాన్య టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారని, చంద్రబాబు తరహాలో ధనికులనే చట్టసభలకు పంపాలానని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ రావు శ్రీనివాసరావు ప్రశ్నించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్‌కు టికెట్ ఇచ్చారానంటూ హేళన చేయడం చంద్రబాబుకే చెల్లిందని విమర్శించారు. కష్టపడి ఎంఏ, బీఈడీ చేశారని.. కుటుంబ పోషణ కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో నిరుద్యోగాన్ని పెంచి పోషించారని, ఈ క్రమంలో డ్రైవర్లు, కూలీలుగా అనేక మంది మారారని ఆరోపించారు.

ఆదాలకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ దొంతాలి పంచాయతీలో యానాది సంఘ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాలకీర్తి రవి హాజరయ్యారు. నేతలు శేఖర్‌బాబు, సురేష్, స్వర్ణ జీవన్, ప్రసాద్, అరవ కామాక్షమ్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు గుర్తింపునివ్వాలని వినతి

నెల్లూరు(మినీబైపాస్): ఆర్ఎంపీలకు ప్రభుత్వం గుర్తింపునివ్వాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

ఘన నివాళి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత దాసరి రాజేష్ తండ్రి వెంకటసుబ్బయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రాజేష్ నివాసానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్, రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సంక్షేమం, అభివృద్ధితో సుభిక్షంగా రాష్ట్రం



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. ఆరో డివిజన్లోని ప్రకాష్‌నగర్, పప్పులవీధి మెయిన్‌రోడ్డు, సాలివీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు గానూ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, సిటీ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ, ఏడో డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం తగదు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పొట్టేపాళెంలో చేసిన అభివృద్ధిని ఓర్వలేక కొందరు అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని పార్టీ నేత బండి శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. పొట్టేపాళెంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ఆరోపణలను ఖండించారు. పొట్టేపాళెంలో ఇరిగేషన్ పొరంబోకు స్థలం 400 అంకణాలు ఉందని, గతంలో పంచాయతీలో తీర్మానం చేసి, అన్ని పార్టీలతో కమిటీని ఏర్పాటు చేశారని చెప్పారు. 2021 డిసెంబర్‌లో గ్రామ సచివాలయం, ఆర్బీకే, బల్క్‌మిల్క్, ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్, కల్యాణ మండపాన్ని నిర్మించాలని తీర్మానించామని తెలిపారు. ఇరిగేషన్ శాఖ నుంచి ఎన్ఓసీని తీసుకొచ్చి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు టెండర్ల అనంతరం రూ.20 లక్షలతో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి భూమి పూజను చేపట్టామన్నారు. కల్యాణ మండప నిర్మాణానికి తమకెలాంటి అభ్యంతరాల్లేవని చెప్పారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఎన్ఓసీ వచ్చాక కోర్టును కొందరు ఆశ్రయించారని తెలిపారు. రాజకీయంగా పబ్బం గడుపుకొనేందుకు యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చొరవతో పొట్టేపాళెంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. నేతలు శేషురెడ్డి, రవీంద్రరెడ్డి, సుధాకర్, కోటేశ్వరరావు, శ్రీనివాసులరెడ్డి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ స్మరణోత్సవాలు ప్రారంభం



త్యాగరాజస్వామి నగరోత్సవం



గాత్రకచేరి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో త్యాగరాజ స్మరణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలుత వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరం నుంచి సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత త్యాగరాజస్వామి ఉత్సవమూర్తులు, చిత్రపటాన్ని ఊరేగింపుగా పురమందిరం వరకు తీసుకొచ్చారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హరికథ గానాన్ని పరాయితం నారాయణరావు, వేదవతి ఆధ్వర్యంలో జరిపారు. నిడమానూరు నటరాజ బృందంతో నాదస్వర కచేరి.. స్థానిక సంగీత విద్వాంసులు, ఔత్సాహిక విద్యార్థుల ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి కృతుల ఆలాపన, పంచరత్నగోష్టి గానాన్ని వీనులవిందుగా నిర్వహించారు. సింహపురి వీణాత్రయం శిష్య బృందం 21 మందితో వీణానాదం.. నాగపూర్ణిమ గాత్రం మధురంగా సాగింది.

అలరించిన గాత్రకచేరి

స్మరణోత్సవాల్లో భాగంగా చెన్నైకి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు భవ్యహరి బృంద ఆధ్వర్యంలో ప్రధాన గాత్రకచేరి అలరించింది. వాద్య సహకారాన్ని శుభశ్రీ శివరామకృష్ణ, బుర్రా శ్రీరామ్, శివరామకృష్ణ అందించారు. భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

చంద్రశేఖర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న కోటేశ్వరరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై విమర్శలు చేసే స్థాయి రూప్‌కుమార్‌యాదవ్‌కు లేదని నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా రెండుసార్లు.. శాసనమండలి ఎన్నికల్లో ఘన విజయం సాధించి రికార్డు సృష్టించిన వ్యక్తి చంద్రశేఖర్‌రెడ్డి అని కొనియాడారు. కరోనా మహమ్మారి సమయంలో ఆయన ఎన్నో సేవలను అందించారని చెప్పారు. రాజకీయాలకు ఆయన కొత్తే అయినా, జిల్లా ప్రజలకు సుపరిచితులన్నారు. ఆయనపై కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గునుకుల కిశోర్ విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో శనివారం జరిగింది. నాయుడుపేటకు చెందిన కృష్ణమోహన్ పనినిమిత్తం మోటారు బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా, చెముడుగుంట సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కృష్ణమోహన్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.